క్లుప్తంగా

నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలింపు



పోలీస్‌స్టేషన్ సమీపంలో ఇసుక తరలిస్తున్న నంబర్ ప్లేట్ లేని ట్రాక్టర్

విజయపురం: మండల కేంద్రంలో తిరిగే చాలా ట్రాక్టర్లకు నంబర్ ప్లేట్లు లేవు. కొందరు గుట్టు చప్పుడు కాకుండా నంబరు ప్లేటు లేని ట్రాక్టర్లలో ఇసుకను సరిహద్దుకు దాటివేస్తున్నారని స్థానికులు ప్రజలు ఆరోపిస్తున్నారు. నిబంధనల ప్రకారం ఇసుక తరలించే ట్రాక్టర్‌కు రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్, డ్రైవర్ లైసెన్స్ తప్పని సరి. కమర్షియల్ వాహనంలోనే ఇసుక తరలించాలి. అయితే ఈ నిబంధనలకు విరుద్ధంగా కొందరు అగ్రికల్చర్ ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తున్నారు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే అధికారులు తనిఖీ చేపట్టి ఇసుక వాహనాలను స్వాధీనం చేసుకుని నామమాత్రపు జరిమానాలు విధిస్తూ వదిలేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి ఇసుక తరలిస్తూ ట్రాక్టర్లకు నెంబర్ ప్లేటు ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సుస్థిరాభివృద్ధి శిక్షణకు సర్పంచులేరీ..?



శిక్షణ కార్యక్రమంలో ఉద్యోగులు తప్పితే కనిపించని సర్పంచులు

పాలసముద్రం: సుస్థిరాభివృద్ధిపై మండలం ప్రజాపరిషత్ కార్యాలయంలో ఇచ్చిన రెండ్రోజుల శిక్షణకు సర్పంచులెవరూ హాజరుకాకపోవడం చర్చకు తావిచ్చింది. ఎంపీడీఓ క్రిష్ణమహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమ, మంగళవారం ఈ శిక్షణ ఇచ్చారు. సర్పంచులకు ఎంపీడీఓకు నడుమ సమన్వయం లోపించడంతో వారంతా గైర్హాజరైనట్టు తెలుస్తోంది. పంచాయతీల్లో కీలకపాత్ర పోషించాల్సిన సర్పంచులు శిక్షణకు రాకపోవడం, మండల స్థాయి ఉద్యోగులకు మాత్రం శిక్షణ ఇస్తే సరిపోతుందా? అనే విమర్శలొచ్చాయి.

సైబర్ క్రైంపై అవగాహన



సైబర్ క్రైంపై అవగాహన కల్పిస్తున్న సీఐ

నగరి : సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలోని వెలుగు సమావేశమందిరంలో నిర్వహించిన రెండురోజుల శిక్షణలో భాగంగా మంగళవారం సైబర్ క్రైంపై అవగాహన కల్పించారు. ఈ శిక్షణా శిబిరంలో పాల్గొన్న సీఐ మహేశ్వర్ యువత డ్రగ్స్, గంజాయి వంటి చెడు అలవాట్లకు లోనుకావడం గురించి, వాటి వలన కలిగే అనర్థాల గురించి వివరించారు. బహుమతులు వచ్చింది సంప్రదించండి అని ఫోన్‌లో వచ్చే మెసేజ్‌లకు ఎవరూ స్పందించకూడదన్నారు. ఆధార్ నెంబరు చెప్పండి, ఓటీపీ చెప్పండి అని అడిగే వారికి ఫోన్లలో వాటిని చెప్పరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సతీష్, హౌసింగ్ ఏఈ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ధనుర్మాస పూజలు ప్రారంభం



పారాయణం చేస్తున్న మహిళలు

నగరి : పట్టణ పరిధిలో టీటీడీ ఆధీనంలో ఉన్న కరియమాణిక్యస్వామి ఆలయంలో ధనుర్మాస పూజలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వేకువజామున 4 గంటలకే సుమారు 300 మంది మహిళలు ఈ పూజలకు హాజరయ్యారు. ఆండాలు పాశురాలు, విష్ణు సహస్త్ర పారాయణం విశేషంగా నిర్వహించారు. ప్రత్యేకంగా శిక్షణ పొందిన మహిళలు ఈ కార్యక్రమం నిర్వహించడంతో ఇది ప్రత్యేకతను సంతరించుకుంది. నెలరోజుల పాటు ఈ పారాయణం ఉంటుందని పండిట్ శివప్రసాద్ తెలిపారు.

భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం

నిండ్ర: మండలంలోని రైతులు తమ పొలాల్లో భూసార పరీక్షలు చేసి వాటి ఆధారంగా ఎరువులు వాడాలని నగరి వ్యవసాయ సహాయ సంచాలకులు సౌభాగ్యలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మట్లాడుతూ రైతులు తమ పొలంలో భూసార పరీక్షలు చేయించి లోపాలను గుర్తించి కావలసిన పోషకాలను వాడాలని అన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయం ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి తులసీరాం తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతా.. దుఃఖీభవ!

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలవుతున్నా రైతాంగం సంక్షేమానికి చర్యలు తీసుకున్న పాపానపోవడం లేదు. 'అన్నదాత సుఖీభవ' పథకం పేరిట రైతాంగానికి పెట్టుబడి సాయం ఇస్తామని ఎన్నికల్లో ఊదరగొట్టింది. తీరా నెలలు గడుస్తున్నా, అప్పులతో పంటలు సాగు చేసి, ప్రకృతి వైపరీత్యాల మూలాన తీవ్ర నష్టం వాటిల్లుతున్నా రూపాయి కూడా విదల్చడం లేదు.

- 'అన్నదాత సుఖీభవ' హామీ నెరవేర్చని కూటమి ప్రభుత్వం
- మండిపడుతున్న రైతులు





తుపాను ప్రభావంతో నష్టపోయిన వరి పంటలను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

పాలసముద్రం: మండలంలో ఖరీఫ్ సీజన్‌లో వరి, కంది, చెరకు తదితర పంటలు మండలంలో సుమారు 700 ఎకరాల్లో సాగు చేశారు. ఇటీవల కురిసిన వర్షం కారణంగా వరి 200 ఎకరాల్లో, కంది, చెరకు దాదాపు 300 ఎకరాల్లో వర్షార్పణమయ్యాయి. అధికారులు పంట నష్టంపై అంచనా వేసి నష్టపరిహారం మాత్రం చెల్లించలేదు. రైతులకు కనీసం పెట్టుబడి సాయం కూడా ఇవ్వలేదు. ఇదే గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో రైతు భరోసా పథకం ద్వారా ఏటా సాగు సమయానికి నగదును రైతుల ఖాతాల్లో జమ చేసి వారికి అండగా నిలిచింది. అన్నదాత సుఖీభవ పథకం పేరిట రైతులకు పెట్టుబడి సాయం కింద రూ 20 వేలు ఇస్తామని ఊదరగొట్టిన చంద్రబాబు ఆ దిశగా చర్యలు ఇప్పటికీ తీసుకోలేదు. రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం వాటి నడ్డి విరుస్తోంది. గతంలో కేంద్ర ప్రభుత్వం రూ.6 వేలు కాకుండా మిగిలిన రూ 7500 రెండు విడతలుగా అందేవని రైతులు గుర్తుచేశారు. మొదటి విడతగా ఖరీఫ్ ప్రారంభం మే నెలలో రూ 5500, రెండో విడతగా రబీ సీజన్ జనవరిలో రూ.2 వేలు జగన్ ప్రభుత్వం అందించిందని రైతులు గుర్తు చేశారు. కొన్ని రోజులుగా మండలంలో కురిసిన వర్షానికి పంటలు నష్టపోయామని, ప్రభుత్వం స్పందించి పరిహారం ఇవ్వాలని పలువురు రైతులు కోరుతున్నారు.

అప్పు చేసి రెండు ఎకరాల్లో వరి సాగు చేశా



వరి సాగుకు ఇది అదును కావడంతో అప్పుచేసి రెండు ఎకరాల్లో పంట సాగు చేశా. పెట్టుబడి సాయం కోసం ఎదురు చూస్తు న్నా. ప్రభుత్వం స్పందించి రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వాలి. గత ప్రభుత్వం రైతులను అన్ని రకాలుగా ఆదుకుంది. అధికార ప్రభుత్వం కూడా అదే రీతిలో ఆదుకోవాలి.

–కే.రాజేంద్రన్, శ్రీకావేరిరాజుపురం, రైతు

చేతికొచ్చే వేళ పంట నేలపాలైంది



కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షం కారణంగా చేతికి రావాల్సిన వరి పంట నేలకు ఒరిగి గాలులకు గింజ రాలిపోయి దిగుబడి తగ్గింది. పంటకు సరైన ధర లేదు. తగ్గించి అడుగుతున్నారు. ఇలాగైతే రైతులు అన్ని రకాలుగా నష్టపోవాల్సిందే. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి.

– పాల్‌రాజు, అయ్యప్పరాజుకండ్రిగ

తెగుళ్ల నివారణకు రూ.10 వేలు ఖర్చు చేశా



భారీ వర్షం కారణంగా వరిని తెగుళ్లు ఆశించాయి. ఇప్పటికీ రూ.10 వేలు ఖర్చు చేసి పలు రకాల మందులను పంటలపై మూడుసార్లు పిచికారీ చేశా. ప్రభుత్వం సాయం చేయాలి. రైతులు అన్ని విధాలా నష్టపోయారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతులు మేలు జరిగింది.

– క్రిష్ణయ్య, ఏట్టుకూరిపల్లె, రైతు

వర్షం వస్తుందేమోనని పంటను కోయించా



ఇటీవల మండలంలో తుపాను ప్రభావంతో కురిసిన వర్షానికి పంట పూర్తిగా దెబ్బతింటుందేమోననే ఉద్దేశంతో పంట కోతకు రాకమునుపే మెషిన్ సాయంతో కోత కోయించా. పెట్టుబడి పెరిగిన దరిమిలా ప్రభుత్వం ధాన్యానికి గిట్టుబడి ధర కల్పిస్తే బాగుంటుంది.

– మణిరెడ్డి, సుబ్బరాజుఇండ్లు, రైతు

తల్లి పాల విశిష్టతపై అవగాహన

నిండ్ర: మండలంలోని కొప్పెడు దళితవాడ అంగన్‌వాడీ కేంద్రం ఆధర్యంలో మంగళవారం తల్లి పాల విశిష్టతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల సూపర్‌వైజర్ శ్యామల పాల్గొన్నారు. ఆమె మట్లాడుతూ బిడ్డ పుట్టినప్పటి నుంచి 6 నేలల వరకు తల్లి పాలను మాత్రమే అందించాలని అన్నారు. అటు తరువాత అదనపు పోషకాలు అందించాలని అన్నారు. తల్లి పాల బిడ్డకు శ్రేయస్కరమని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రీ సర్వే తప్పిదాలను పరిష్కరించండి

–డిప్యూటీ కలెక్టర్ వెంకటశివ



మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ వెంకటశివ

గంగాధరనెల్లూరు : రీ–సర్వేలో జరిగిన తప్పులను త్వరితగతిన పరిష్కరించాలని డిప్యూటీ కలెక్టర్ వెంకటశివ ఆదేశించారు. మండలంలోని నందనూరు, వెజ్జుపల్లెలో మంగళవారం నిర్వహించిన రీ–సర్వే గ్రామ సభలో ఆయన మాట్లాడారు. రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారానికి సదస్సులను ప్రభుత్వం నిర్వహిస్తోందని, రైతుల భూ సమస్యలను, ఇబ్బందులను పరిష్కరించేందుకు రెవెన్యూ ఉద్యోగులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. రికార్డులను పరిశీలించి రైతులకు న్యాయం చేయాలన్నారు. రైతులు ప్రత్యేక రీసర్వే గ్రామసభను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తహసీల్దార్ చంద్రశేఖర్, సర్పంచ్ హరిప్రసాద్‌రెడ్డి, ఆర్ఐ ఏకాంబరం, రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జాతర కోలాహలం





ప్రత్యేక అలంకరణలో బంగారమ్మ, అలరించిన మదన వేషాలు

కార్వేటినగరం: జాతరను పురస్కరించుకుని స్థానిక గ్రామదేవత బంగారమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక అభిషేకాలు, పూజలు, అలంకరణలు చేశారు. మండల కేంద్రంలో ఎటు చూసినా భక్తుల సందడి నెలకొంది. యువత, వివిధ వేషధారణలతో పిల్లలు, పెద్దలు అమ్మవారిని దర్శించుకున్నారు. బంగారమ్మ, నడివీధి గంగమ్మలకు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆలయం వద్ద మహిళలు పొంగళ్లు వండి, పిండిదీపాలతో నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. అలాగే అంబలిని భక్తులకు పంచిపెట్టారు. మహిళా భక్తులు తడిదుస్తులతో ఆలయం చుట్టూ పొర్లుదండాలు పెట్టారు. కొందరు వేపాకులను ధరించి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. ఇక, అమ్మవారి ఆలయాన్ని సుగంధ భరిత పుష్పాలతో, గ్రామ వీధులను సైతం విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఆలయ ఆవరణలో నిర్వాహకులు భక్తులకు అన్న ప్రసాదాల వితరణ చేశారు. జాతర ఏర్పాట్లను ఆలయ కమిటీ అధ్యక్షుడు కే.ప్రసాద్, కార్యదర్శి చంద్రశేఖర్‌పిళ్లై ,ఉపాధ్యక్షుడు రంగనాధ మొదలియార్ పర్యవేక్షించారు. కార్వేటినగరం గంగ జాతర పురస్కరించుకుని యువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మదన వేషాలు చూపరులను అలరించాయి. జాతరలో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని ఆలయ కమిటీకి సీఐ హనుమంతప్ప సూచించారు. ప్రధాన కూడలి ప్రాంతాల్లో బందోబస్తు ఏర్పాటు చేసినట్టు ఎస్‌ఐ రాజ్‌కుమార్ చెప్పారు.

సుస్థిర అభివృద్ధికి సహకరించండి



శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్న అధికారులు

వెదురుకుప్పం: సుస్థిర అభివృద్ధికి సహకరించాలని ఎంపీడీఓ అమర్‌నాథ్ కోరారు. మంగళవారం వెదురుకుప్పంలో సుస్థిర అభివృద్ధిపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. గ్రామాలను శుభ్రమైన హరిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని, గ్రామాల అభివృద్ధికి సర్పంచులు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ పురుషోత్తం, సర్పంచులు శిల్ప, కావేరి, గ్రామ కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

టీబీ వ్యాధిపై అవగాహన

నగరి : నగరి టీబీ యూనిట్ పరిధిలో బ్రీత్ సేఫ్ 360 టీబీ అలర్ట్ ఇండియా వారి సహకారంతో గుండ్రాజుకుప్పం పీహెచ్‌సీలో హెల్త్ క్యాంపు నిర్వహించారు. 55 మంది వర్కర్స్ స్క్రీనింగ్ చేయడం టీబీ పైన అవగాహన కల్పిస్తూ టీబీ స్పుటం 10 శాంపిల్స్ కలెక్ట్ చేశారు. టీబీపై వారికి అవగాహన కలిప్పించారు. డా.రమేష్ కుమార్, వైద్యులు కీర్తి, ప్రదీప్ కుమార్, టీబీ అలర్ట్ కో–ఆర్డినేటర్ బాబు, నిర్వాహకులు శ్రీనివాస్, పవన్, కుమారి, ప్రేమ, యామిని పనిదవల్లి పాల్గొన్నారు.

దొంగ అరెస్టు

శ్రీరంగరాజపురం : మండల కేంద్రంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌లో రూ.2 లక్షల నగదును నగదు చోరీ చేసిన దొంగను పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌ఐ సుమన్ తెలిపిన వివరాల మేరకు.. ఈ ఏడాది జనవరి 2వ తేదీన మండల కేంద్రంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ లాకర్‌లో ఉన్న రూ.2.40 లక్షలను ప్రకాశం జిల్లా పొదిలి మండలం కాటూరివారిపాళెం గ్రామానికి చెందిన కంచర్ల వెంకటరావు (42) చోరీ చేశాడన్నారు. అతనిపై ఇప్పటికే రాష్ట్రంలో పలు పోలీసు స్టేషన్లలో దాదాపు 12 కేసులు ఉన్నాయని తెలిపారు. దొంగను రిమాండ్‌కు తరలించామన్నారు.

చర్చి ప్రారంభం

విజయపురం : మండలంలోని మాధవరం కాలనీలో నూతనంగా నిర్మించిన చర్చి సీఎస్ఐ బిషప్.రెవ.హెచ్ శర్మ నిత్యానందం మంగళవారం ప్రారంభించారు. ముందుగా చర్చిలో బలిపీఠంపై శిలువను ప్రతిష్టించారు. ప్రార్థనామందిరాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బిషప్ మాట్లాడుతూ ఏసు మార్గంలో నడుచుకోవాలని సూచించారు. అనంతరం అన్నదానం, వస్త్రదానం, బహుమతులు అందజేశారు.

కిశోర వికాసం.. బాలిక భవితకు పునాది



మాట్లాడుతున్న డాక్టర్ సోమశేఖర్

విజయపురం : కిశోర వికాసం కార్యక్రమం ద్వారా బాలికల బంగారు భవితకు పునాది వేస్తుందని డాక్టర్ సోమశేఖర్ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యక్రమంలో మంగళవారం నిర్వహించిన కిశోర వికాసం కార్యక్రమాన్ని సీడీపీవో కృష్ణవేణి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి బాలిక భవిష్యత్‌ను మెరుగుపరచడానికి కిశోర వికాసం మంచి అవకాశమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, ఎన్జీఓల సమన్వయంతో కార్యక్రమం పునఃప్రారంభమైందన్నారు. 11–18 ఏళ్ల బాలికలకు విద్య, ఆరోగ్యం, భద్రత, ఆర్థిక స్వావలంబనను మెరుగుపరచడం ఈ కార్యక్రమ లక్ష్యమని తెలిపారు. సీడీపీవో కృష్ణవేణి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో బాలికల సంఘాలను ఏర్పాటు చేసి అవగాహన కల్పించడంతోపాటు, సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్టు చెప్పారు. డిజిటల్ భద్రత, సైబర్ క్రైమ్, ఆన్‌లైన్ వేదికలపై జాగ్రత్తగా ఉండేలా అవగాహన కల్పించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమణ ప్రకాష్, ఎస్‌ఐ బలరాం, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, ఏఎస్‌ఎంలు, మహిళ పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు ముమ్మరం



తాగునీటిని పరిశీలిస్తున్న ఈవోపీఆర్‌డీ రాజేంద్రన్, సిబ్బంది

విజయపురం : మండల కేంద్రంలోని దళితవాడలో మంగళవారం సర్పంచ్ జబామేరీ పారిశుద్ధ్య పనులు చేపట్టారు. జేసీబీ ద్వారా మురికి కాలువల్లో పూడికతీత పనులు చేపట్టారు. పేడదిబ్బలను తొలగించారు. మురుగునీటి కాలువ, నీటి కొళాయి వద్ద బ్లీచింగ్ చేపట్టారు. రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు తొలగించారు. అనంతరం ఈవోపీఆర్‌డీ రాజేంద్రన్, సిబ్బంది వాసు తాగునీటి పరీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పరిసరాల శుభ్రత పాటించాలన్నారు. ఇంటి పరిసరాల్లో పాత టైర్లు, బాటిల్స్ ఉన్నట్లయితే వాటిని తొలగించారు. పొడి, తడి చెత్తను వేరు చేసి, ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు.

నేడు సర్పంచ్‌లకు ప్రత్యేక శిక్షణ

విజయపురం : మండలంలోని సర్పంచ్‌లకు రెండు రోజులు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రమణ ప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18, 19వ తేదీ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు శిక్షణ ఉంటుంది. ప్రతి సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

విరమణ ఉద్యోగానికే
సేవకు కాదు

వారంతా దశాబ్దాల పాటు ప్రజా సేవలో తరించారు. తమ ఉద్యోగ జీవితంలో ఎందరికో వెన్నుదన్నుగా నిలిచారు. ఉద్యోగ విరమణ చేసినా, తమలోని సేవా జిజ్ఞాస కొనసాగిస్తున్నారు. సమాజానికి ఇంకా ఏదో చేయాలన్న తపన.. ఆశయంతో ముందడుగు వేస్తున్నారు. పెన్షన్ సొమ్ముల విరాళాలతో తమ కంటూ ఒక భవనాన్ని నిర్మించుకున్నారు. మలిదశలోనూ నలుగురికీ సాయం చేస్తూ.. సామాజిక సేవలో ముందుండి ఆదర్శంగా నిలుస్తున్నారు నగరి, నిండ్ర, విజయపురం మండలాలకు చెందిన విశ్రాంత ఉద్యోగులు. సహచరులకు అవసరమైన వైద్య సేవలు ఉచితంగా అందిస్తున్నారంటూ భరోసానిస్తున్నారు. అలుపెరగని సేవలందిస్తూ.. తోటివారికి అండగా నిలుస్తుండగా, వారిని పలువురు అభినందిస్తున్నారు.

- విశ్రాంత జీవితాన్ని ఆదర్శంగా మలుచుకున్న వైనం
- మలిదశలోనూ సామాజిక సేవలు
- సహచరులకు ఉచితంగా వైద్య సేవలు
- మనకు మనమే అండ అంటూ తోటి వారికి అండగా నిలుస్తున్న వైనం
- నేడు విశ్రాంత ఉద్యోగ సంఘ రజతోత్సవం



విశ్రాంత ఉద్యోగ సంఘ భవనం

నగరి : పదవీ విరమణ అంటే బాధ్యతల నుంచి తప్పుకొని ప్రశాంతంగా జీవించడమే అనేది అందరికీ తెలిసిన సత్యం. కానీ నగరి, నిండ్ర, విజయపురం మండలాలకు చెందిన విశ్రాంత ఉద్యోగులు విరమణ అంటే ఇంటికే పరిమితం కావడం, టీవీలు చూస్తూ కాలం వెళ్లదీయడం కాదని సేవ చేయడానికి వచ్చిన అవకాశమని భావించారు. సంఘటితమై తమ కంటూ ఒక సంఘాన్ని ఏర్పాటు చేసుకొని మలిదశలోనూ నలుగురికి సాయం చేస్తున్నారు. నగరి సబ్ ట్రెజరీ కార్యాలయం పరిధిలోని మండలాలకు చెందిన విశ్రాంత ఉద్యోగుల సంఘం 1999 అక్టోబరు 27వ తేదీన 25 మంది సభ్యులతో ప్రారంభమైంది. బి.భాస్కరన్, ఓ.బాలసుబ్రమణ్యం చొరవతో ఈ సంఘం ఏర్పాటైంది. 25 సంవత్సరాలుగా సహచరులకు అవసరమైన సేవలను సంఘం అందిస్తోంది. 945 మందితో ప్రస్తుతం ఈ విశ్రాంత ఉద్యోగుల సంఘం నడుస్తోంది.

పదమూడేళ్ల క్రితం సొంత భవన నిర్మాణం

సంఘటితమైన విశ్రాంత ఉద్యోగులు కలసి ఉండటానికి, సేవా కార్యక్రమాలు చేపట్టడానికి ఒక భవనం ఉంటే బాగుంటుందని భావించారు. 2010వ ఏడాది తమ వృద్ధాప్యాన్ని పక్కన పెట్టి భవన నిర్మాణానికి ప్రయత్నాలు చేపట్టారు. సరస్వతి నిర్మల రాజగోపాల్‌రాజు అనే పారిశ్రామికవేత్త వీరి ఉత్సాహాన్ని చూసి భవన నిర్మాణానికి కావలసిన స్థలం కొనుగోలుకు రూ.4.5 లక్షలు విరాళంగా అందించారు. దీంతో స్థలం సిద్ధమైంది. పెన్షనర్లు పీఆర్సీ ద్వారా తమకు వచ్చిన ఆర్థిక సౌలభ్యాన్ని రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకు విరాళంగా అందించడంతో భవన నిర్మాణం ప్రారంభమైంది. 2012 ఫిబ్రవరి 24వ తేదీన వారి కల ఫలించి వారికంటూ ఒక భవనం ఏర్పడింది. నేడు ఆ భవనం విశ్రాంత ఉద్యోగులు అనే పెద్ద కుటుంబానికి నిలయంగా మారడంతోపాటు పలు కార్యక్రమాలకు తక్కువ ధరకు భవానాన్ని అద్దెకు ఇవ్వడం ద్వారా వచ్చే ఆదాయం పలు సేవా కార్యక్రమాలకు ఉపయోగపడుతోంది. నిర్మించే సమయంలో అది రాష్ట్రంలోనే పెన్షనర్లు కట్టుకున్న తొలిభవనం కావడం విశేషం.



కంటి వైద్య శిబిరం (ఫైల్)

సేవలు ఇలా..

- చిన్నారులకు, స్త్రీలకు, విశ్రాంత ఉద్యోగులకు అంటూ ఉచితంగా వైద్య సేవలు అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇప్పటికే 162 సార్లు ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటుచేసి 1,550 మందికి పరీక్షలు నిర్వహించి 204 మందికి కంటి ఆపరేషన్లు చేయించారు. 13 సార్లు హోమియో వైద్య శిబిరం ఏర్పాటు చేసి మందులు అందజేశారు. అమెరికన్ వైద్య బృందంచే రెండు సార్లు వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. మెదడువాపు, గుండె సంబంధిత చికిత్స, జనరల్ చెకప్ అంటూ వైద్యశిబిరాలు ఏర్పాటుచేశారు. ఇలా వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తూ, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందిస్తున్నారు.
- 2003లో సంఘం ద్వారా ఉచితంగా డీఎస్సీ కోచింగ్ ఇప్పించగా శిక్షణ పొందిన వారిలో 25 మంది ఎంపికయ్యారు.
- పదవీ విరమణ పొందిన తోటి విశ్రాంత ఉద్యోగులను సన్మానిస్తున్నారు. ఏటా పెన్షనర్స్ డే రోజున విరమణ పొంది 15 యేళ్లు దాటిన సీనియర్ పెన్షనర్‌ను ఘనంగా సత్కరిస్తున్నారు. నేడు ఇలా 9 మందిని సత్కరించనున్నారు.
- పెన్షనర్లకు ప్రతి ఏడాది నవంబర్, డిసెంబర్ నెలల్లో బ్యాంకుల వద్దకే వెళ్లి లైఫ్ సర్టిఫికెట్లు పూరించి సబ్‌ట్రెజరీ కార్యాలయంలో సమర్పించే ప్రక్రియలో సహకారం అందిస్తున్నారు. బ్యాంకు లోన్లు పొందేందుకు సహకారం అందిస్తున్నారు.
- దివంగతులైన పెన్షనర్ల జీవిత భాగస్వాములకు ఆ పెన్షన్ అందించడంలో కీలకపాత్ర పోషిస్తున్నారు.
- దహనక్రియలకు ప్రభుత్వం చెల్లించే పైకం పొందడానికి అవసరమైన ప్రక్రియలకు సహకారం అందిస్తున్నారు.
- ఆర్ట్స్ ఆఫ్ లివింగ్ ఉపాధ్యాయుల ద్వారా అప్పుడప్పుడూ యోగాపై శిక్షణ అందిస్తున్నారు.

తోటివారికి సాయం చేస్తున్నాం



తమ సంఘంలోని సభ్యులకు అవసరమైన సహాయ, సహకారాలు అందిస్తున్నాం. పదవీ విరమణ పొందిన సమయంలో వచ్చే పెన్షన్, ఇతరత్రా కార్యాలయాల పనులను చక్కబెడతాం. ఆరోగ్యం బాగా లేనివారికి కూడా అవసరమైన వైద్య పరీక్షలను ఉచిత వైద్య శిబిరాల ద్వారా అందిస్తున్నాం. లైఫ్ సర్టిఫికెట్లు తీసుకోవడంలోనూ, హెల్త్ కార్డులు అందుకోవడంలోనూ అందరూ కలసి చేసుకోవడం వలన సమస్యలు లేవు. విశ్రాంత దశలో ఉన్నవారితో ఏర్పడ్డ సంఘం. మాలో విభేదాలకు చోటులేదు.

– జయచంద్రుడు, అధ్యక్షులు, విశ్రాంత ఉద్యోగుల సంఘం, నగరి.

మాకు అండగా పెద్ద కుటుంబమే ఉంది



25 ఏళ్ల క్రితం 25 మందితో మా సంఘం ప్రారంభమైంది. నేడు 945 మందితో పెద్ద కుటుంబంగా మారింది. ప్రతి విశ్రాంత ఉద్యోగికి అండగా నేడు ఓ పెద్ద కుటుంబం ఉంది. ప్రభుత్వ ఉద్యోగులు పదవీ విరమణ పొందిన తరువాత విరమణ సదుపాయాలు పొందడంలో పలు సమస్యలు ఎదుర్కొంటారు. పెన్షనర్లు మృతి చెందితే వారి జీవిత భాగస్వామికి పెన్షన్ మార్చిడిలోను, ఆర్థిక సాయం అందుకోవడంలోనూ పలు సమస్యలు ఎదుర్కొంటారు. వీటిని పరిష్కరించాలన్న తలంపుతోనే 1999లో సంఘం పురుడుపోసుకుంది. నేడు శాఖోపశాఖలుగా విస్తరించి మహావృక్షమైంది. విరమణతో నిరుత్సాహపడేవారు మా సంఘంలో చేరి ఉత్సాహవంతులు అవుతున్నారు.

– ఓ.బాలసుబ్రమణ్యం, ప్రధాన కార్యదర్శి, విశ్రాంత ఉద్యోగుల సంఘం, నగరి